# మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక






సంపుటి : 01 | సంచిక : 89 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | గురువారం, 26 ఫిబ్రవరి 2026 | పేజీలు : 4


# తెర పైకి ప్రెస్టన్ భూముల వివాదం

- భూములు అన్యాక్రాంతం అంటూ ఒకరు..
- కాలేదంటూ మరొకరు పరస్పర విమర్శలు
- ఒకరిపై ఒకరు పోటాపోటీగా ప్రెస్‌మీట్లు
- ఈ వివాదం ఏవైపునకు దారితీస్తుందో..?


2


*వర్ధిల్లుమా ప్రెస్టన్ విద్యాలయమా..*
*వరదాయిని దివ్య దేవాలయమా..*
*వేలాది మందికి సుఖాశ్రయమా..*
*వెలుగైన దేవుడి దివ్యాలయా...*

ఇది.. ప్రెస్టన్ పాఠశాలలో చదివిన ప్రతి విద్యార్థికి తెలిసిన పాఠశాల గీతం.. కానీ.. ఆ గీతం అర్థం మారుతోంది. ఎంతో మందిని విద్యావంతులను చేసిన ప్రెస్టన్ పాఠశాలకు ఇప్పుడు గడ్డుకాలం వచ్చింది. భూ ఆక్రమణదారులు, కబ్జాకోరుల చేతుల్లో పడి విలవిల్లాడుతోంది.

*- ఉప్పలంచి నరేందర్, మన చౌరాస్తా*





# తెలంగాణలో భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

- జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషాకూ స్థానచలనం
- జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ బదిలీ..
- జనగామకు సందీప్ కుమార్ ఝా నియామకం

**జనగామ, మన చౌరాస్తా:**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనలో కీలక మార్పులు చేస్తూ భారీ సంఖ్యలో ఐఏఎస్ (IAS) అధికారులను బదిలీ చేసింది. మొత్తం 45 మంది అధికారులకు కొత్త బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో రాష్ట్ర సచివాలయంలోని కీలక శాఖల నుంచి జిల్లాల కలెక్టర్ల వరకు అనేక మార్పులు జరిగాయి. ఇక జనగామ జిల్లాలో కలెక్టర్ బాధ్యతలు నిర్వర్తిస్తున్న రిజ్వాన్ బాషా షేక్ జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్‌గా బదిలీ కాగా.. ఆయన స్థానంలో జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ సందీప్ కుమార్ ఝాను ఇక్కడకు బదిలీ చేశారు. ఇక రిజ్వాన్ బాషా జనగామకు కలెక్టర్‌గా వచ్చాక ఎంతో చురుకుగా పనిచేస్తున్న జిల్లా రాష్ట్ర, దేశ స్థాయిలో మంచి పేరు తెచ్చారు.






# తెరపైకి ప్రెస్టన్ భూముల వివాదం

- భూములు అన్యాక్రాంతం అంటూ ఒకరు.. కాలేదంటూ మరొకరు పరస్పర విమర్శలు
- ఒకరిపై ఒకరు పోటాపోటీగా ప్రెస్‌మీట్లు
- ఈ వివాదం ఏవైపునకు దారితీస్తుందో..?

(ఉప్పలంచి నరేందర్, మన చౌరాస్తా )

**'వర్ధిల్లుమా ప్రెస్టన్ విద్యాలయమా.. వరదాయిని దివ్య దేవాలయమా.. వేలాది మందికి సుఖాశ్రయమా.. వెలుగైన దేవుడి దివ్యాలయా...' ఇది.. ప్రెస్టన్ పాఠశాలలో చదివిన ప్రతి విద్యార్థికి తెలిసిన పాఠశాల గీతం.. కానీ.. ఆ గీతం అర్థం మారుతోంది.. ఎంతో మందిని విద్యావంతులను చేసిన ప్రెస్టన్ పాఠశాలకు ఇప్పుడు గడ్డుకాలం వచ్చింది. భూ ఆక్రమణదారులు, కబ్జాకోరుల చేతుల్లో పడి విలవిల్లాడుతోంది.**



ఎంతో మందిని విద్యావంతులు చేసిన ప్రెస్టన్ భూముల వివాదం మరో మారు తెరపైకి వచ్చింది. ఈ భూములు అన్యాక్రాంతం అయ్యాయని ఒకరు.. కాలేదంటూ మరొకరు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ మీడియా ముందుకు రావడం స్థానికంగా మరో సారి ప్రెస్టన్ భూములపై ఆసక్తికర చర్చకు దారితీసింది.

**ప్రహరీ కూల్చివేతతో...**

జనగామ పట్టణంలోని మిషన్ ట్రస్ట్ ఆస్తులకు సంబంధించిన ఇప్పటికే అనేక అక్రమణలు జరిగిన విషయం తెలిసిందే. అయితే తాజా మరోసారి ఈ భూముల వ్యహారం చిలికిచిలికి గాలి వానలా మారుతున్నట్టు తెలుస్తోంది. కొన్ని రోజు కింద ప్రెస్టన్ పాఠశాల వెనుకాల ఉన్న ప్రహరీగోడ (రదర్ ఫోర్డ్ హాస్టల్ వెనుక) గ్రౌండ్‌కు సంబంధించిన భూమి తాము కొనుగోలు చేశామంటూ కొందరు అక్కడి ప్రహరీని కూల్చి వేసి కబ్జాలోకి వచ్చే ప్రతయ్నం చేశారు. దీంతో జనగామ క్రైస్తవ సంఘాల బాప్టిస్టు పొలసమాజం, జనగామ ఫీల్డ్ ప్రాపర్టీ ప్రొటెక్షన్ కమిటీ ఆధ్వర్యంలో మళ్లీ ఆ ప్రహరీ నిర్మించి, భూఅక్రమాలు, హైకోర్టు ఉత్తర్వుల ఉల్లంఘనపై మీడియాకు లీకులిచ్చారు. ఈ అక్రమణలకు బక్క లక్ష్మణ్, తిప్పరపు ఆనంద్ వారి వెనుక తుమ్మ జగన్మోహన్ రెడ్డి హస్తం ఉందనే ఆరోపణలు చేశారు. దీంతో ప్రెస్టన్‌కు సంబంధించి ప్లాట్లుగా కొనుగోలు చేసిన వాటిలో ఎలాంటి అన్యాక్రాంతం జరగలేదని విద్యాసంస్థ అధినేత తుమ్మ జగన్మోహన్‌రెడ్డి మీడియా ముందు స్పష్టం చేశారు. కొంతమంది పనిగట్టుకుని తనపై అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

**మిషన్ భూములు అమ్మే హక్కులేదు**
**– రిటైర్ ప్రిన్సిపాల్ కె.ఎం జాన్**

జనగామ పట్టణంలోని ప్రెస్టన్ భూములను అమ్మే హక్కు ఎవరికీ లేదని ప్రెస్టన్ పాఠశాల రిటైర్ ప్రిన్సిపాల్ కె.ఎం జాన్ స్పష్టం చేశారు. బుధ వారం ప్రెస్టన్ పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రెస్టన్ పాఠశాల స్థాపన, మిషనరీలు జనగామ, హన్మకొండ ప్రాంతాల్లో చేసిన సేవలు, అలాగే మిషన్ ఆస్తుల వివరాల చరిత్రను విలేకరులకు వివరించారు. ప్రెస్టన్ ఆస్తుల పరిరక్షణ కోసం జనగామ పట్టణ ప్రజలంతా సహకరించాలని ఆయన కోరారు. 1989 సంవత్సరంలో ఐదు ప్రాంత సభ్యులు డి. జయరాజు (కావలి), చి.యేసురత్నం (నల్గొండ), వి.ఎస్. మోసెస్ (గుంటూరు), కె. పాల్ (మార్కాపురం), జి.వందనం (ఒంగోలు) ప్రాపర్టీ అసోసియేషన్ ఆఫ్ బాప్టిస్ట్ చర్చెస్ (PABC) పై దాఖలు చేసిన దీర్ఘకాలిక సి.ఎస్. నం.124 కేసు ఒక కీలక మైలురాయిని చేరుకుందన్నారు. 1994లో నంబర్ పొందిన ఈ కేసులో PABC నిధుల దుర్వినియోగం, అనధికారిక ఆస్తి లావాదేవీలపై ఆరోపణలు ఉన్నాయన్నారు. 1994లో మద్రాస్ హైకోర్టు తీర్పు ప్రకారం, పిటిషనర్లకు తెలియకుండా PABC ఎలాంటి ఆస్తి లావాదేవీలు చేయకూడదని గుర్తుచేశారు. సమావేశంలో దేవదానం, డమేరా జేమ్స్, బక్కా ప్రవీణ్‌కుమార్, యేసుపాదం, వెంకటేష్, రాజారత్నం, తుడి ఆనంద్, సామ్యూల్ కరుణాకర్, రాజ్ కుమార్ రోడ్రిక్స్, ఫీల్డ్ ఎల్డర్స్, క్రైస్తవులు పాల్గొన్నారు.

**ఐక్యపోరాటానికి సిద్ధం**

జనగామ, నల్గొండ, హైదరాబాద్, సూర్యాపేట, హన్మకొండ ప్రాంతాలకు చెందిన మిషన్ ఆస్తుల పరిరక్షణకు ఐక్యపోరాటానికి సిద్ధమవుతున్నారు. డెక్కన్ అసోసియేషన్ సభ్యులు, 30 మంది బాప్టిస్టు పాస్టర్లు, జనగామ ప్రాపర్టీ ప్రొటెక్షన్ కమిటీ సభ్యులు భూఅక్రమాలపై తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. రాబోయే రోజుల్లో ఈ పోరాటాన్ని తీవ్రతరం చేయనున్నట్టు చెబుతున్నారు.



# ధన్ ధాన్య యోజనపై సమీక్ష



**జనగామ, మన చౌరాస్తా :** వ్యవసాయ, రైతుల సంక్షేమ శాఖ భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో అమలులో ఉన్న ప్రధాన్ మంత్రి ధన్ ధాన్య యోజన (PMDDKY) కార్యక్రమ అమలుపై కేంద్ర ప్రభుత్వ సంయుక్త కార్యదర్శి చిన్మయ్ పి. గోట్మారే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జనగాం జిల్లా నుండి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. పింకేష్ కుమార్, జిల్లా కలెక్టరేట్ (IDOC) పాల్గొన్నారు. ఈ సందర్భంగా గతంలో రూపొందించిన 6 సంవత్సరాల కార్యాచరణ ప్రణాళిక (Action Plan) అమలు పురోగతి, మండల స్థాయిలో లక్ష్య సాధన స్థితి, డ్యాష్‌బోర్డ్‌లో నమోదైన పురోగతి వివరాలు, భౌతిక, ఆర్థిక సాధనలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. పథకంలో నిర్దేశించుకున్న ప్రధాన లక్ష్యాలు, పంటల ఉత్పాదకత పెంపొందించడం, సుస్థిర వ్యవసాయ పద్ధతుల అవలంబన, రైతులకు సులభతర ఋణ సదుపాయాలు కల్పించడం, ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించడం, వ్యవసాయ అనుబంధ పరిశ్రమల అభివృద్ధి, సమగ్ర నీటి యాజమాన్యం, వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికత వినియోగం వంటి అంశాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ, పశుసంవర్ధక శాఖ, మత్స్య శాఖ, మార్కెటింగ్ శాఖ, సహకార విభాగం, భూగర్భ జలాలు, పౌర సరఫరాలు, నీటిపారుదల శాఖ, నాబార్డ్, ఇతర అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ మాట్లాడుతూ, జనగాం జిల్లాను PMDDKY అమలులో ఆదర్శ జిల్లాగా నిలబెట్టేలా ప్రతి శాఖ సమన్వయంతో, సమగ్ర ప్రణాళికతో సమయపాలనతో లక్ష్య సాధన దిశగా కృషి చేయాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని స్పష్టం చేశారు.



# సిద్దిపేటలో బీఎంఎస్ భారీ ధర్నా

**సిద్దిపేట, మన చౌరాస్తా :** సిద్దిపేట జిల్లా కేంద్రంలో భారతీయ మజ్దూర్ సంఘ్ (బిఎంఎస్) ఆధ్వర్యంలో భారీ ధర్నా కార్యక్రమం నిర్వహించారు. కార్మికులు వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిర్వహించిన ఈ ఆందోళనలో పెద్ద సంఖ్యలో కార్మికులు, బి ఎం ఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిఎంఎస్ నేతలు మాట్లాడుతూ ఈపీఎఫ్95 కనీస పెన్షన్‌ను ప్రస్తుతం ఉన్న రూ.1000 నుండి రూ.7500కు పెంచాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల వేతనాలకు సంబంధించిన జీఓలను వెంటనే అమలు చేయాలని కోరారు. బీడీ కార్మికుల జీవన భృతి, మరణ భృతి రూపంలో ప్రకటించిన ఆర్థిక సాయాన్ని తక్షణమే అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.అసంఘటిత కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా బీడీ కార్మికులకు 1000 బీడీలకు కనీసం రూ.500 కూలి ఇవ్వాలని పేర్కొన్నారు. స్కీమ్ వర్కర్స్ అయిన ఆశా, అంగన్‌వాడి, మిడ్‌డే మీల్స్, సీహెచ్‌ఓ, ఫార్మా ల్యాబ్స్ లిమిటెడ్ ఉద్యోగులు ధర్నాలో పాల్గొని తమ సమస్యలను వెల్లడించారు. వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, సామాజిక భద్రతతో పాటు గ్రాట్యుటీ, పెన్షన్ వంటి ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా బిఎంఎస్ జాతీయ అధ్యక్షులు సుంకరి మల్లేశం మాట్లాడుతూ...గత ప్రభుత్వాలు కార్మికుల సమస్యలను పట్టించుకోలేదని విమర్శించారు. 2019లో కేంద్ర ప్రభుత్వం కార్మికుల పక్షాన చట్టపరమైన మార్పులు తీసుకువచ్చిందని పేర్కొన్నారు. ఆ చట్టం ప్రకారం దేశవ్యాప్తంగా 44 కోట్లకు పైగా అసంఘటిత కార్మికులు లబ్ధి పొందే విధంగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ నిబంధనలు 2026 ఏప్రిల్ నుండి అమల్లోకి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు.దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కార్మికులకు సామాజిక భద్రత విస్తరించేందుకు కృషి జరుగుతోందని ఆయన పేర్కొన్నారు. కార్మిక సంక్షేమం విషయంలో కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని, కానీ రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యాయని ఆరోపించారు.ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని కార్మిక నాయకులు హెచ్చరించారు.కార్యక్రమంలో బిఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు కలాల్ శ్రీనివాస్, నాయకులు ముద్దం రాజిరెడ్డి, ఉమేష్, కొండల్ రెడ్డి రాజన్న (ఆర్టీసీ), పయ్యావుల భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

# కాప్రా ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఎన్నిక

- **అధ్యక్షుడిగా మెరుగు చంద్రమోహన్, కార్యదర్శుడిగా ముత్యం ముఖేష్ గౌడ్**

**కాప్రా, మన చౌరాస్తా :** కాప్రా ప్రెస్ క్లబ్ నూతన కమిటీ బుధవారం టిఎస్ఐఐసీ కాలనీలోని ప్రెస్ క్లబ్ లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ సలహాదారులు ఏంపల్లి పద్మారెడ్డి, బెలిదే అశోక్, అధ్యక్షుడిగా మెరుగు చంద్రమోహన్, ఉపాధ్యక్షుడిగా దిలీప్ కుమార్, యావాపురం రవి, దొమ్మాటి కిరణ్ కుమార్, గార్లపాటి శ్రీనివాస్ రావు, ప్రధాన కార్యదర్శిగా ముత్యం ముఖేష్ గౌడ్, సంయుక్త కార్యదర్శిగా డి. శ్రీనివాస్, కె. వెంకట్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా ఓ. నరసింహ, కీర్తి శ్రీనివాస్, కోశాధికారిగా రామచంద్రమూర్తి, కార్యవర్గ సభ్యులుగా గంగి కృష్ణ, గోవిందు కుంట్ల ఆంజనేయులు, బుడంపల్లి నిరంత్ గౌడ్, తొడుపునూరు బాలకృష్ణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు మెరుగు చంద్రమోహన్, ముత్యం ముఖేష్ గౌడ్, కోశాధికారి రామచంద్రమూర్తి మాట్లాడుతూ కాప్రా ప్రెస్ క్లబ్ జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. తమను కాప్రా ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు, కోశాధికారిగా ఎన్నుకున్న సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో నూతన సభ్యులకు సభ్యత్వాలను అందజేయనున్నట్లు తెలిపారు.



**నూతన కమిటీకి అభినందనల వెల్లువ**

కాప్రా ప్రెస్ క్లబ్ నూతన కమిటీకి పలువురు అభినందనలు తెలిపారు. అధ్యక్షులుగా మెరుగు చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శిగా ముత్యం ముఖేష్ గౌడ్, కోశాధికారిగా రామచంద్ర మూర్తిలతో పాటు కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు. అనంతరం పేరుపేరునా అభినందనలు తెలిపారు. ఏఎస్ రావు నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్లు సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి, పజ్జూరి పావనిరెడ్డి, కొత్త రామారావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బొజ్జ రాఘవరెడ్డి, కొత్త అంజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఏఎస్ రావునగర్ డివిజన్ అధ్యక్షుడు కేశెట్టి ప్రసాద్, తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి నీరుకొండ సతీష్ బాబు, బీజేపీ చర్లపల్లి డివిజన్ అధ్యక్షులు చల్లా ప్రభాకర్, సీనియర్ నాయకులు కనుకుల రజినీకాంత్ రెడ్డి, బీఆర్ఎస్ ఏఎస్ రావునగర్ డివిజన్ అధ్యక్షుడు కాసం మహిపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పెద్దాపురం కుమారస్వామి, నాయకులు, వంజరి ప్రవీణ్ కరిపే, ఎస్ఎ. రహీమ్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎం. శివానంద్ తదితరులు అభినందనలు తెలిపారు.





# ప్లాట్ల కోల్పోతున్న వారికి పరిహారం ఇవ్వాలి

## సీపీఎం జనగామ జిల్లా కార్యదర్శి మోకు కనకా రెడ్డి

**జనగామ, మన చౌరాస్తా :-** జనగామ నుండి దుద్దెడ వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారి 365 బి నిర్మాణంలో జనగామ పట్టణంలోని ఏకశిలా వద్ద ప్లాట్లను కోల్పోతున్న బాధిత ప్లాట్ యజమానులకు నష్టపరిహారం ఇవ్వకుండా ఎన్ హెచ్ రహదారి పనులు చేపడుతున్నారు. ఈ పనులను అడ్డుకుంటామని సీపీఎం జనగామ జిల్లా కార్యదర్శి మోకు కనకా రెడ్డి తెలిపారు. బాధిత ప్లాటు యజమానులు రెండవ రోజు చేపట్టిన రిలే నిరాహార దీక్షకు కనకారెడ్డి మద్దతు తెలిపి మాట్లాడారు. జనగామ చుట్టుపక్కల గ్రామాల రైతులు పట్టణంలోని కార్మికులు చిన్న ఉద్యోగులు వారి భవిష్యత్తు కోసం పిల్లల భవిష్యత్తు కోసం అని పట్టణాలలో ప్లాటు కొనుక్కుంటే ఇయ్యాల రహదారుల అభివృద్ధి పేరుతోటి ప్లాట్లు జాగను గుంజుకుంటున్నారు. ప్రభుత్వం సరైన నష్టపరిహారం ఇవ్వడం లేదు. నష్టపరిహారం ఇచ్చినాకనే పనులు చేపట్టాలని భూసేకరణ చట్టంలో నిబంధనలు ఉన్నాయని, 2013 భూ సేకరణ చట్టంలోని నిబంధనలు తుంగలో తొక్కి అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఇది సరైన పద్ధతి కాదని, బాధితులకు నష్టపరిహారం చెల్లిచాకే పనులు చేపట్టాలని లేకుంటే సిపిఎం ప్రత్యక్ష కార్యాచరణకు దిగి బాధితుల పక్షాన నిలబడి పనులను అడ్డుకుంటామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొట్ల శేఖర్, జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి, నాయకులు పోతునూరి కనుక చారి, డివైఎఫ్ఐ నాయకులు మోకు విప్లవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ కావ్యకు అరుదైన గౌరవం

## అంతర్జాతీయ పార్లమెంటరీ బాధ్యత



**హనుమకొండ, మన చౌరాస్తా :** వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య గారికి అరుదైన గౌరవం దక్కింది. ఇటీవల ఏర్పాటు చేసిన ఇండియా-సౌదీ అరేబియా పార్లమెంటరీ ఫ్రెండ్‌షిప్ గ్రూప్ సభ్యురాలిగా వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య గారిని గౌరవనీయ లోక్‌సభ స్పీకర్ నామినేట్ చేశారు. ఈ మేరకు లోక్‌సభ సెక్రటేరియట్ (కాన్ఫరెన్స్ అండ్ ప్రోటోకాల్ బ్రాంచ్) అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. భారతదేశం - సౌదీ అరేబియా మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయడం, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో సహకారాన్ని విస్తరించడమే లక్ష్యంగా ఈ పార్లమెంటరీ ఫ్రెండ్‌షిప్ గ్రూప్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యగారు మాట్లాడుతూ ఈ బాధ్యత తనకు అప్పగించినందుకు లోక్‌సభ స్పీకర్ గారికి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కృతజ్ఞతలు తెలిపారు. భారత్-సౌదీ అరేబియా మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా పార్లమెంటరీ స్థాయిలో తన వంతు కృషి చేస్తానని ఎంపీ స్పష్టం చేశారు. ఈ నామినేషన్ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గానికి గర్వకారణమని, అంతర్జాతీయ పార్లమెంటరీ వేదికపై తెలంగాణకు మరింత గుర్తింపు తీసుకువస్తుందని ఎంపీ అభిప్రాయపడ్డారు.

# బీసీ బిడ్డకు మద్దతు ఇచ్చాడే గాని పూటకో పార్టీ మారలేదు



**గజ్వేల్, మన చౌరాస్తా :** గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా వివిధ రాజకీయ పార్టీలు పరస్పర అవగాహనతో నిర్ణయాలు తీసుకున్నాయని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ బీజేపీ నాయకులు పేర్కొన్నారు. పార్టీ ఉన్నత నాయకత్వం తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునందన్ రావు బిఆర్ఎస్‌కు చెందిన బీసీ వర్గ అభ్యర్థికి మద్దతు ఇచ్చారని వారు తెలిపారు. ఈ నేపథ్యంలో ఎంపీపై అనవసర ఆరోపణలు చేయడం తగదని, రాజకీయ అవకాశవాదంతో విమర్శలు చేయడం సమంజసం కాదని వారు అన్నారు. గతంలో వివిధ పార్టీలలో పదవులు అనుభవించి, పరిస్థితులు మారినప్పుడు పార్టీలు మారిన నాయకులు ఇప్పుడు బీసీల పేరుతో రాజకీయ లాభం పొందేందుకు ప్రయత్నించడం సరికాదని విమర్శించారు. ఎంపీ రఘునందన్ రావు నిజాయితీ గల నాయకుడని, అధికార పార్టీ వైపు వెళ్లకుండా ప్రజల్లోనే ఉంటూ ఎమ్మెల్యేగా, అనంతరం ఎంపీగా గెలిచి తన నిబద్ధతను నిరూపించుకున్నారని పేర్కొన్నారు. బీసీలకు, ముఖ్యంగా ముదిరాజ్ వర్గానికి ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు. సిద్దిపేట జిల్లాలో పార్టీ పదవుల్లో ముదిరాజ్ వర్గానికి అవకాశాలు కల్పించారని, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ఎన్నికల్లో 20 వార్డులలో ఆరుగురు ముదిరాజ్ అభ్యర్థులకు బీఫారాలు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. బీసీ వర్గాల పేరుతో విభజన సృష్టించే ప్రయత్నాలు మానుకోవాలని హెచ్చరించారు. ముదిరాజ్ సమాజాన్ని స్వార్థ రాజకీయాల కోసం ఉపయోగించొద్దని సూచించారు. ఎంపీపై అసత్య ఆరోపణలు చేస్తే సహించబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ నాలుగో వార్డ్ కౌన్సిలర్ రొట్టెల శ్రీను ముదిరాజు, మునిసిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, బీజేపీ సీనియర్ నాయకులు మామిండ్ల నాగు ముదిరాజ్, మాజీ కౌన్సిలర్ రొట్టెల దాస్ ముదిరాజ్, కదుల ఎల్ల ముదిరాజ్, కాల సాయి ముదిరాజ్, శ్రీరామ్ కృష్ణ ముదిరాజ్, చిక్కుడు ప్రసాద్ ముదిరాజ్, దేవేందర్ ముదిరాజ్, రాజు ముదిరాజ్, మధు ముదిరాజ్, టోనీ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

**కామారెడ్డి, మన చౌరాస్తా :** జిల్లాలో నేటి నుండి ప్రారంభమైన ఇంటర్ ప్రథమ సంవత్సరం వార్షిక పరీక్షల సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, ప్రశ్నాపత్రాల భద్రత, సీసీ కెమెరాల పర్యవేక్షణ, విద్యార్థుల హాజరు శాతం,హాల్ టికెట్ల తనిఖీ తదితర అంశాలను ఆయన పరిశీలించారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, నిబంధనల ప్రకారం సజావుగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు రాయడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# wanted

## విలేకరులు కావలెను




మన చౌరాస్తా తెలుగు దినపత్రిక స్థాపించిన అనతి కాలంలోనే పాఠకుల విశేష ఆదరణ పొందుతూ డిజిటల్ మీడియా రంగంలో దూసుకెళ్తోంది. స్థానిక సమస్యలపై, రాజకీయ, ఎడ్యుకేషన్, ఆరోగ్యం, సినిమా వార్తలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగుతోంది. మా పత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను.. పూర్తి వివరాలకు ఈ కింది నంబర్లలో సంప్రదించగలరు.

**manachourasta@gmail.com**

**8555800812** **9676400812**

Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**